www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 220, గురువారం 10-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి**



3లో..

**సర్పంచుల సమస్యల పరిష్కారానికి గళమెత్తిన 20 మండలాల సర్పంచులు**



4వ పేజీల్లో

## దళితులు నడిచిన నేలను...
# శుద్ధి చేసిన బిఆర్ఎస్

### ఫామ్ హౌస్ కుట్రపై నిరసన తెలిపేందుకే డప్పు వాయించిన కాంగ్రెస్, ఎవరిని తిట్టలేదు కొట్టలేదు : రేవంత్

- ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ
- బిఆర్ఎస్ సభ్యులను ఉన్మాదులుగా తయారు చేసిన కేసీఆర్
- బిఆర్ఎస్ నేతలు అంటరానితనాన్ని కొనసాగించడం దురదృష్టకరం
- కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని భావించాం
- కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం
- అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్ : రేవంత్

హైదరాబాద్ సెప్టెంబర్ 9:

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటు చేసుకుందని ..మిగతా 2లో

> **స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానం**





## విమర్శలను... న్యాయవ్యవస్థ
# స్వీకరిస్తుంది

### సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది
### ఎన్‌సీఈఆర్‌టీపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ సెప్టెంబర్ 9:

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్‌సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని ..మిగతా 2లో

## తమిళనాడులో
# కొత్త కూటమి

సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్

సీఎం విజయ్ నాయకత్వంలో ఏర్పాటుకు సిద్ధం

2

## కెనడా ఉత్పత్తులపై
# అమెరికా నిషేధం

అమల్లోకి తెచ్చిన ప్రతీకార సుంకాలు

2



## బీఆర్ఎస్ శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

### గవర్నర్ ను కలిసిన వారిలో పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు

హైదరాబాద్ సెప్టెంబర్ 9:

లోకభవన్‌లో గవర్నర్ శివ్‌కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు. స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు ..మిగతా 2లో



## మహిళా ప్రతినిధుల చీర లాగిన పోలీసులు

పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

దాడికి సంబంధించిన ఆధారాలు చూపాం : కేటీఆర్

2

# రికార్డులను తారుమారు చేసి... ఘోరాలు, నేరాలు, పాపాలు చేసిన వైసిపి

- ఎల్ నినో నేపథ్యంలో గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు నీరు సముద్రంలో వృధాగా కలిసింది
- ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా
- సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- కోనసీమలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ



కోనసీమ సెప్టెంబర్ 9 :

సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన అనే మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే ..మిగతా 2లో

# స్థానిక ఎన్నికల కేంద్రాల ఖరారుకు షెడ్యూల్

సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన

15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన

2



## ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ
# అనవచ్చునా

ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా

ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదు

కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

2



## 10 వేల కోట్లతో
# రైల్వే కారిడార్

దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్

తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం

4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు

పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం

రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్

2

## శాసనసభ నుంచి
# వాకౌట్ చేసిన బీజేపీ

### స్పష్టమైన అజెండా తర్వాతే సభకు వస్తాం... బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ సెప్టెంబర్ 9:

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీలో దుమారం రేగింది. సభలోలేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. సభ ఉల్లంఘన జరిగినప్పుడు బీజేపీ శాసనసభపక్ష నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అసెంబ్లీలో పేర్కొన్నారు. ఏ నియమ నిబంధనల ప్రకారంగా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. కొత్తగా ఏమైనా పుస్తకం తయారు చేసుకున్నారా ప్రశ్నించారు. గ్రామాల్లో ఏడు గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ..మిగతా 2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై
# కేసు నమోదు

హైదరాబాద్ సెప్టెంబర్ 09:

మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారన్న ఘటనపై కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం అసెంబ్లీ గేట్ నంబర్ 03 వద్ద జరిగిన ఘటనపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో దీచరే 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352 తీ/ష 3(5) సెక్షన్ల కింద బీఆర్ఎస్ నాయకులపై ..మిగతా 2లో



# మహిళా ప్రతినిధుల చీర లాగిన పోలీసులు

### పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

### దాడికి సంబంధించిన ఆధారాలు చూపాం : కేటీఆర్

హైదారాబాద్ సెప్టెంబర్ 9:

లోకభవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే, నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేము నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలి కొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73 వేల కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూ కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విమర్శలను... న్యాయవ్యవస్థ స్వీకరిస్తుంది

మొదటి పేజీ తరువాయి...

అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోరుమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న న్యాయమూర్తిల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్ కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది.

## స్థానిక ఎన్నికల కేంద్రాల ఖరారుకు షెడ్యూల్

అమరావతి సెప్టెంబర్ 9:

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

## తమిళనాడులో కొత్త కూటమి

చెన్నై, సెప్టెంబర్ 09:

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజరు అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ ఇండియన్ ముస్లిం లీగ్ వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రికార్డులను తారుమారు చేసి... ఘోరాలు, నేరాలు, పాపాలు చేసిన వైసిపి

మొదటి పేజీ తరువాయి...

వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడవ శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు."రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు.

# 10 వేల కోట్లతో రైల్వే కారిడార్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:

రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్ కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్ పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం- రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్- కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయ పడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది.

## దళితులు నడిచిన నేలను... శుద్ధి చేసిన బిఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి...

వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తుచేశారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజరుకుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజరుకుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా ప్రశ్నించారు.

## ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ అనవచ్చునా

హైదారాబాద్ సెప్టెంబర్ 9:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

### విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

అమరావతి సెప్టెంబర్ 9:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వినాయక చవితి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని అందించే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ప్రజలు ఎలాంటి విద్యుత్ బిల్లుల భారం లేకుండా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకోవచ్చని మంత్రి నారా లోకేష్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకునేందుకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని స్పష్టం చేశారు.

# కెనడా ఉత్పత్తులపై అమెరికా నిషేధం

న్యూఢిల్లీ సెప్టెంబర్ 9:

అమెరికా- కెనడా మధ్య వాణిజ్య వివాదం మరింత ముదిరింది. కెనడా విధించిన ప్రతీకార సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, ఆటో విడిభాగాలు, మద్యం, పాల ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తూ ఏకంగా ఐదు ఉత్తర్వులు జారీ చేశారు. భారీ, దీర్ఘకాలిక అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కెనడియన్ ఉత్పత్తులపై నిషేధం వించాలని జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. అమెరికా ఉత్పత్తులకు కెనడా పూర్తి న్యాయమైన పరస్పర ప్రయోజనం కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ వాహనాలు, ఆటోమొబైల్ విడిభాగాలను అమెరికాలోకి దిగుమతి చేయకుండా నిషేధించేలా ట్రంప్ తొలి ఉత్తర్వును జారీ చేశారు. కెనడాలోని కొన్ని ప్రావిన్సులు అమెరికా బీర్, వైన్, స్పిరిట్స్ పంపిణీ, రిటైల్ విక్రయాలు, కొనుగోళ్లపై ఆంక్షలు విధిస్తున్నాయని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా కొన్ని కెనడియన్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించే పరిధిని మార్చుతూ ట్రంప్ రెండో ఉత్తర్వు జారీ చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ డెయిరీ ఉత్పత్తులను అమెరికాలోకి దిగుమతి చేసుకోకుండా నేరుగా నిషేధిస్తూ మూడవ ఉత్తర్వు జారీ చేశారు. అమెరికా మద్యం ఉత్పత్తులపై కెనడాలోని ప్రావిన్సులు విధిస్తున్న ఆంక్షలకు ప్రతిగా, ఎంపిక చేసిన కెనడియన్ మద్యం ఉత్పత్తుల దిగుమతులను నిషేధిస్తూ మరో ఉత్తర్వు తీసుకొచ్చారు. మోటార్ వాహనాల వివాదానికి సంబంధించిన అదనపు సుంకాల పరిధిని కూడా ఐదో ఉత్తర్వుతో మార్చారు. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వ ప్రధాన కొనుగోలు వ్యవస్థ నుంచి కెనడియన్ ఉత్పత్తులను తొలగించాలని ట్రంప్ ఆదేశించారు. జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ (జీఎస్ఏ) ట్రేడ్ రిప్రజెంటేటివ్ లు ఈ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. కెనడా కూడా అమెరికా సంస్థలు, రైతులకు సమానమైన మార్కెట్ అవకాశాలు కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. 'నో రెసిప్రాసిటీ, నో యాక్సెస్' అనే విధానాన్ని ప్రకటించారు.

## యూపీ ఎన్నికల అనంతరం... ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే

హైదారాబాద్ సెప్టెంబర్ 9:

తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తి ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## బీఆర్ఎస్ శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి...

గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు, గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు. తన ఫామ్‌హౌస్ రోడ్డులో దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. బీఆర్ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన శుద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలి. దళితులను అవమానించటం కేసీఆర్ ఆదేశాలతోనే జరుగుతున్నదా, కేసీఆర్ ఆదేశించకపోతే ఎందుకుస్ అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్ఎస్ నేతల తీరును గవర్నర్‌కు వివరించడం కోసమే తాము లోక భవన్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసి అసెంబ్లీలో తొలిరోజు వివాదం, తమ సస్పెన్షన్ గురించి వివరించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి...

కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారని ఫిర్యాదులో బాధిత పోలీసు సిబ్బంది వెల్లడించారు. మహిళా పోలీసులను ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా పోలీసులు అని చూడకుండా తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తించకుండా అడ్డుకుని బెదిరించినట్లు వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులు పరిశీలించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తన దురుసుగా ఉందని తెలిపారు. మహిళా పోలీసులను నెట్టడంతో ఇబ్బంది కలిగించారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో తమకు తీవ్ర మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం మహిళా పోలీసులకు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేసినట్లు వివరించారు. కేటీఆర్, హరీశ్‌రావు, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డి సహా పలువురిపై కేసు నమోదైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు కాంగ్రెస్ విఫలమైందంటూ నినాదాలున్న నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ బీఆర్ఎస్ నేతలకు పోలీసులకు మధ్య తోపులాట చేసుకుంది. ఒక రకంగా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. తమను ఎందుకు లోపలికి అనుమతించడం లేదని హరీశ్ రావు పోలీసులను ప్రశ్నించారు. దానికి బదులుగా టీషర్టులపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉన్నాయని, వాటికి అనుమతి లేదని స్పీకర్ ఆదేశాలిచ్చారని స్పందనగా పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహావేశాలతో హరీశ్ రావుతో పాటు పులువురు నేతలు అక్కడే టీషర్టులు తీసేసి బనియన్లతో నిరసన తెలిపి లోపలికి పంపించాలని వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్ నేతలకు తీవ్రంగా తోపులాట జరిగి వివాదానికి దారి తీసింది. ఇక్కడే పోలీసులపై బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడ్డారు. దీంతో అక్కడే ఉన్న మహిళా పోలీసులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. దానికి సంబంధించిన ఫొటోలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. దీనిపై తాజాగా కేసులు రిజిస్టర్ అయ్యాయి. మహిళా పోలీసులకు సంబంధించిన ఘటనపై మంత్రి సీతక్క విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు అయ్యాయి.

## శాసనసభ నుంచి వాకౌట్ చేసిన బీజేపీ

మొదటి పేజీ తరువాయి...

ఆరోపించారు. బీఏసీలో చెప్పినట్లు సభ నడుపుతారా లేదా రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ పై ఎప్పుడూ చర్చిస్తారో చెప్పే వరకు సభలో మా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. భలో లేనివారిని సస్పెండ్ చేయడం దారుణం. ఇష్టానుసారం సస్పెండ్ చేయడం బాధాకరం. రైతు సమస్యలపై చర్చ ఉంటుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. బీఏసీలో చెప్పిన ప్రకారం సభ నడుపుతారా అని అన్నారు. సభ ఔన్నత్యాన్ని కాపాడటం మనందరి బాధ్యతన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ స్థానంలో ఉన్న వారి గౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలని హితువు పలికారు. ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న మంత్రి శ్రీధర్‌బాబు సభ కార్యక్రమాలను నిరంతరం అడ్డుకోవడం సమంజసమా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళిత స్పష్టమైన అజెండా ఇచ్చిన తర్వాతే సభకు వస్తామని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**- కలెక్టర్ అంకిత్**
**- తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దు**
**- ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి**
**- పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం ,సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):** టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, ప్రయోగశాలలు, భోజనం, పరిశుభ్రత, యూనిఫాంలు, వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. 8, 9, 10వ తరగతుల గదులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, స్కాలర్‌షిప్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కోసం విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఆర్ట్ అండ్ డ్రాయింగ్ తరగతిని పరిశీలించి బోధిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. 8వ తరగతి లైబ్రరీ పీరియడ్‌కు బదులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తరగతి సమయాన్ని పూర్తిగా విద్యాబోధనకే కేటాయించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాల్లో నిమగ్నం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, బ్యాంకు ఖాతాల ప్రారంభం, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్‌ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకు పరిమితం చేయకుండా ప్రయోగాత్మకంగా నేర్పడం ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థి ప్రయోగాల్లో స్వయంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రయోగశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆసక్తి పెంపొందించేలా బోధన సాగాలని అన్నారు. కొత్తగా చేరిన కొంతమంది విద్యార్థులకు యూనిఫాంలు ఇంకా అందలేదని ప్రిన్సిపల్ వివరించడంతో, అర్హులైన విద్యార్థులందరికీ యూనిఫాంలు త్వరగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. భోజనశాల, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంట సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న ఆహారం వివరాలను తెలుసుకున్నారు. ప్రధాన వంట మనిషి అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలియడంతో, విద్యార్థులకు భోజనంలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ వంట మనిషిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లోని కూరగాయలు, రిఫ్రిజిరేటర్‌లోని పాలు, పెరుగు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. మందుల నిల్వ, వినియోగానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విద్యాబోధన, ప్రయోగాత్మక విద్య, ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యం, హాజరు తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తమ బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు : ఎస్పీ రోహిత్ రాజు

– వాహనాల కండీషన్‌పై ప్రత్యేక దృష్టి..
– డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):** పోలీస్ శాఖకు చెందిన వాహనాలను ఎల్లప్పుడూ మంచి కండీషన్‌లో ఉంచుతూ, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ వాహనాల డ్రైవర్లను ఆదేశించారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వివిధ పోలీస్ స్టేషన్లు, పోలీస్ అధికారుల వినియోగంలోని వాహనాలను ఎస్పీ స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి వాహనం కండీషన్, పనితీరు, నిర్వహణ తీరును పరిశీలించిన ఎస్పీ.. డ్రైవర్లతో మాట్లాడి విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి డ్రైవర్ తన వాహనం పనితీరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వాహనాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. పోలీస్ డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో విధులు నిర్వహించే సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు వేగంగా అందుబాటులో ఉండటంలో పోలీసు వాహనాల డ్రైవర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, ఆర్ఐ ఎంటీఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా నిలిచిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఘన నివాళులు!!





**పాల్వంచ, సెప్టెంబర్ 09(భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన తెలుగు సాహిత్యానికి, తెలంగాణ సమాజానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను, సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన కాళోజీ సాహిత్య సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డా. ఎస్. స్వరూపారాణి మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యాన్ని, సామాజిక స్పృహను కలిగించాయని పేర్కొన్నారు. ఆయన సాహిత్యం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని తెలిపారు. తెలుగు అధ్యాపకుడు ఈ. శ్రీను మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సమస్యలు మరియు సామాజిక విలువల కోసం తన రచనల ద్వారా గొంతుకగా నిలిచారని అన్నారు. యువత కాళోజీ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి, డాక్టర్ టి అరుణ్ కుమారి విజయ ప్రసాద్ డాక్టర్ వేముల కామేశ్వరరావు పొట్ల పువ్వు శ్రీనివాసరావు పారెల్లి శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ ఎన్ శ్రీదేవి లీల విమల దీపిక కరీమా హారిక ధర్మారావు డాక్టర్ రమేష్ ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు.

# కాళోజీ నారాయణ వేషధారణలో ఆకట్టుకున్న దారా సీర్తిక్





**పాల్వంచ, సెప్టెంబర్ 9(భద్రాద్రి న్యూస్):** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దారా సీర్తిక్ కాళోజీ నారాయణ వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నాడు. తెలుగు భాష గొప్పతనాన్ని, మాతృభాష ప్రాధాన్యతను తెలియజేస్తూ సీర్తిక్ కాళోజీ నారాయణ పాత్రలో తనదైన శైలిలో సందేశాన్ని అందించాడు. తెలుగు భాష, సాహిత్యం కోసం కాళోజీ నారాయణ చేసిన సేవలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో మాతృభాషపై అభిమానం పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళోజీ వేషధారణలో దారా సీర్తిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# కాళోజీ నారాయణరావు జయంతి: కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో ఘన నివాళులు



**కోదాడ, సెప్టెంబర్ 9(భద్రాద్రి న్యూస్):** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంతోష్ కిరణ్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పంజలి ఘటించారు. తెలంగాణ భాష, సంస్కృతి, ఉద్యమాల కోసం కాళోజీ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రేపటి చలో హైదరాబాద్ ను విజయవంతం చేయండి

**– పిలుపునిచ్చిన మధిర TGEJAC నాయకులు**

**TGEJAC** ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న జరుగనున్న చలో హైదరాబాద్ హక్కుల సాధన సభ కు అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు గుర్రం శ్రీనివాసరావు, ఆర్ రంగారావు, షేక్ నాగూర్ వలి పిలుపునిచ్చారు ఈరోజు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయలను భోజన విరామ సమయంలో సందర్శించి నాయకులు మాట్లాడుతూ తక్షణమే పిఆర్సి రిపోర్టు తెప్పించి ఫిట్మెంట్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న 6డీఏ లను వెంటనే విడుదల చేయాలని, నూతన ఆరోగ్య పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పెన్షనర్ల బకాయిలను నెలకు 2000 కోట్ల చొప్పున విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల సాధనే లక్ష్యంగా జరుగుతున్న రేపటి కార్యక్రమానికి లక్షల సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.





# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**కోదాడ,సెప్టెంబర్ 9(భద్రాద్రి న్యూస్):** కోదాడ మండలం గుడిబండ గ్రామ జిల్లాప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార గ్రహీతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, కోదాడ మండల విద్యాధికారి శ్రీ మొహమ్మద్ సలీం షరీఫ్ గారిని, అలాగే సూర్యాపేట జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా ఎంపికైన శ్రీమతి కేసరి విమల కుమారి గారిని కాంగ్రెస్ నాయకులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమాటి నాగిరెడ్డి, రిటైర్డ్ ఎస్సై పులి వెంకటేశ్వర్లు, కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న సలీం షరీఫ్, విమల కుమారిల సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ అవార్డులు అందుకోవడం వారి ప్రతిభకు, నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్ల నరోత్తమ రెడ్డి, కుక్కడపు నాగరాజు, ఎండి బహూద్దీన్, మొహమ్మద్ హసన్ అలీ, పులి రాజారావు, ఎస్కే రఫీ, ఎర్రా నాగశేషు, ఓరుగంటి రమాదేవి మరియు పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో పలు కార్యక్రమాల్లో సోయం వీరభద్రం

**దమ్మపేట, సెప్టెంబర్ 9, భద్రాద్రి న్యూస్:** దమ్మపేట మండలంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సోయం వీరభద్రం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోర్రెగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కీసరి శ్రీను--నాగమణి దంపతుల కుమార్తె వెంకటలక్ష్మి--కిరణ్ వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

అనంతరం మందలపల్లి గ్రామానికి చెందిన ధారా రంగారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సున్నం లలిత, మాజీ సర్పంచ్ చెపా రాఘవయ్య, ఊకే బుల్లిబాబు, పాయం సూర్యం, గుండి సూర్యం, కోర్సా వెంకటేష్, పాకనాటి శ్రీను, కనపర్తి ధర్మారావు, సోయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌కు ప్రాణహాని కుట్రపై దమ్మపేట పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు



**దమ్మపేట సెప్టెంబర్ 9 భద్రాద్రి న్యూస్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రాణహాని కలిగించే కుట్ర జరిగిందంటూ దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఫిర్యాదు చేశారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచనలతో ఎస్ఐ బాలస్వామికి ఫిర్యాదు అందజేశారు. అసెంబ్లీలో జరిగిన పరిణామాలు, షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు, కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు పెద్ద సంఖ్యలో వ్యక్తులు వెళ్లిన అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు, వేధింపులు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాజుబోయిన యేసుబాబు, దారా యుగుందర్, అబ్దుల్ జిన్నా, యట్ల రామదాసు, దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, బుడే, వెలుగోటి మహేష్, పాకనాటి శ్రీను, కాసిని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార లోపాన్ని నివారించేందుకు సమతుల్య ఆహారం తీసుకోవాలి

**-- జిల్లా మహిళా సంక్షేమ అభివృద్ధి అధికారి ఏ.ప్రమీల**





**కామేపల్లి,సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):** గర్భిణీలు, బాలింతలు చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని జిల్లా మహిళా సంక్షేమ అభివృద్ధి అధికారి ఏ ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని కొత్త లింగాల 1 అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా మహిళా సంక్షేమ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులకు సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం,పరిశుభ్రత,వ్యక్తిగత ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. కామేపల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ ఉమ మాట్లాడుతూ సెప్టెంబర్ 8 నుండి అక్టోబర్ 8 వరకు ఈ పోషణ మాసం కార్యక్రమాలను ప్రతి అంగన్వాడి. గ్రామాల తో పాటు మండల స్థాయిలో జరిపి ప్రజల్లో పోషకాహార ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న న్యూట్రీ గార్డెన్ ను చూసి అన్ని అంగన్వాడీలల ఇదేవిధంగా గార్డెన్ ను అభివృద్ధి చేసుకుని వాటిలో పండించే మందులు లేని ఆకుకూరలు కూరగాయలు సెంటర్ లో వండే వంటల్లో వాడుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ వివిధ రకాల ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరు ధాన్యాలు,పోషక పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బి.వరలక్ష్మి,స్కూల్ హెడ్మాస్టర్ డి. మల్లిక,టీచర్ శ్రీదేవి, డాక్టర్ రిషిత,హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్ రావు,ఏ ఎన్ ఎం ముంతాజ్,అంగన్‌వాడీ టీచర్లు, ఆయలు తల్లులు, పిల్లలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బర్లగూడెంలో పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు

## -- మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.నాగులు






**కామేపల్లి,సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):** మండలంలోని బర్లగూడెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల నివారణకు గుర్తింపు,పరీక్షలపై ప్రత్యేక క్యాంప్ బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి రైతులకు పశువుల ఆరోగ్యం,పట్ల జాగ్రత్త తీసుకోవాలని పునరుత్పత్తి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు మాట్లాడుతూ, పశు వుల్లో గర్భకోశ సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే గర్భధారణ శాతం పెరగడంతో పాటు,పశువుల పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. పశువులకు సమతుల్యమైన పోషకాహారం పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని రైతులకు సూచించారు. వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స చేయించడం ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగుపడి,పాల ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ క్యాంప్ లో పశువులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, రైతులకు తగిన వైద్య సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎన్. వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ వెంకటేశ్ గోపాలమిత్రులు నాగు,లక్ష్మయ్య, ధర్మ పాల్గొన్నారు.

# దాడులు, దూషణలకు ప్రజాస్వామ్యంలో చోటు లేదు

## - పోలీసులపై దాడులు, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం
## - చట్టాన్ని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాలి: దిశా కమిటీ సభ్యురాలు, సర్పంచ్ హేమలత బాలాజీ



**కారేపల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్ రాములు ):** పోలీసులపై దాడులు చేయడం, ఇతరులపై దాడులకు పాల్పడటం, శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ అన్నారు. ఇలాంటి చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ చట్టాన్ని, పోలీసు వ్యవస్థను, రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, దాడులకు పాల్పడటం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో చర్చించి పరిష్కారాలు సాధించుకోవాలని సూచించారు. పోలీసులపై దాడులు, ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు సమాజంలో అశాంతికి దారితీస్తాయని అన్నారు. శాసనసభ స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కూడా ఆమె తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తులు సంయమనం పాటించాలని సర్పంచ్ హేమలత బాలాజీ కోరారు.

# మా సమస్యలు తీర్చండి..సారు...

## - వెంటనే స్పందించిన డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి.. బోరు మంజూరు



**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । సెప్టెంబర్ 9**దమ్మపేట గిరిజన బాలుర వసతి గృహంలో నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు. బోరు మోటర్ లేకపోవడంతో పాటు 5 రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన అధికారులు వెంటనే బోరు మోటర్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరగాలి!

## - మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
## - డీజేలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి..
## - భద్రతా చర్యలకు పోలీసుల సహకారం అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : సీఐ సాగర్, ఎస్సై గోపి




**కారేపల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్--రాములు):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సింగరేణి పోలీసులు సూచించారు. సింగరేణి మండల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డీజేల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**భద్రతకు ప్రాధాన్యం :** గణేష్ ఉత్సవాల సమయంలో భద్రతా చర్యలపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసులు సూచించారు. మహిళలు, పిల్లలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరిస్తే గణేష్ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించవచ్చని పోలీసులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పోలీసు అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్పంచుల సమస్యల పరిష్కారానికి గళమెత్తిన 20 మండలాల సర్పంచులు

## - భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి
## - పెండింగ్ గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశం



**కారేపల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గ్రామపంచాయతీలకు నిధుల విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, సర్పంచుల గౌరవ వేతనాల జాప్యం తదితర సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 20 మండలాలకు చెందిన సర్పంచులు ఏకతాటిపైకి వచ్చారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచుల ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. గ్రామపంచాయతీల్లో తీర్మానాలు చేసి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయి, కొలతలు నమోదు చేసినప్పటికీ వాటికి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మేజర్ పంచాయతీలకు రూ.10 లక్షలు, మైనర్ పంచాయతీలకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరారు.

**గౌరవ వేతనం రూ.25 వేలకు పెంచాలి**

సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.25 వేలకు పెంచడంతో పాటు ప్రతి నెలా సకాలంలో వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల్లో సర్పంచులకు కూడా ఓటు హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీల పరిపాలనలో ఉపసర్పంచుల సంతకాల విషయంలో ఎదురవుతున్న సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నోటిఫైడ్ ప్రక్రియలో సంతకాల కారణంగా పరిపాలనకు ఆటంకాలు ఏర్పడుతున్న పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**గౌరవ వేతనాల విడుదలకు కలెక్టర్ ఆదేశాలు**

సర్పంచులు సమర్పించిన వినతిపత్రంలోని అంశాలను జిల్లా కలెక్టర్ సావధానంగా విని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచుల గౌరవ వేతనాలను తక్షణమే విడుదల చేసేలా జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడి వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సర్పంచుల ప్రతినిధులు తెలిపారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి గ్రామపంచాయతీలకు సంబంధించిన సమస్యలను వివరించి మరో వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు.

**ఐక్యంగా పోరాడతాం: భూక్య రంజిత్ కుమార్**

ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమైనప్పటికీ నిధుల కొరత, పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాల జాప్యం కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను సకాలంలో విడుదల చేసి అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల సర్పంచులను సమన్వయం చేసుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతామని భూక్య రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. గ్రామపంచాయతీలకు ఆర్థికంగా బలం చేకూర్చి, ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# గణేష్ వేడుకలకు పోలీసుల స్పష్టమైన హెచ్చరిక

## - భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
## - మహిళలను వేధిస్తే ఉపేక్షించం.. చదువుకున్న వారైనా చట్టం ముందు సమానమే
## - డీజేలు, టపాసులకు అనుమతి లేదు: సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి




**కారేపల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కారేపల్లి పోలీసులు స్పష్టం చేశారు. ఉత్సవాల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తేల్చిచెప్పారు. కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, పోలీసుల మార్గదర్శకాలను నిర్వాహకులు, యువత, ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**మహిళలను వేధిస్తే ఉపేక్షించం**

గణేష్ ఉత్సవాల సందర్భంగా మద్యం లేదా మత్తు పదార్థాలు సేవించి మహిళలు, బాలికలను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, వారి భద్రతకు భంగం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాంటి ఘటనలకు పాల్పడే వారు యువకులైనా, చదువుకున్న వారైనా చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**డీజేలు, టపాసులకు అనుమతి లేదు**

గణేష్ ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా పరిమిత శబ్దంతో శబ్ద పరికరాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన శోభాయాత్రలో టపాసుల వినియోగానికి కూడా అనుమతి లేదని తెలిపారు.

**మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి**

గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని పోలీసులు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా మండపాలు ఏర్పాటు చేయరాదని, ఉత్సవాల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని కోరారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర సేవల వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి**

గణేష్ ఉత్సవాలు భక్తి, క్రమశిక్షణ, సోదరభావంతో సాగాలని పోలీసులు ఆకాంక్షించారు. ఉత్సవాల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మండపాల నిర్వాహకులు, యువత, ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి కోరారు.

# ఏళ్ల నాటి రహదారి సమస్యలకు కదలిక

## - ప్రజా సమస్యల పరిష్కారంపై సర్పంచ్ వరలక్ష్మి రాజు ప్రత్యేక చొరవ
## - అధికారులతో సమన్వయంతో అభివృద్ధి పనులకు వేగం.. గ్రామస్తుల హర్షం

**కారేపల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని రహదారి సమస్యలపై సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా రహదారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ పనులు వేగవంతమయ్యేలా పర్యవేక్షిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

**ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి**

గ్రామంలో మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్పంచ్ ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారుల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పనులకు కదలిక వచ్చిందని తెలిపారు.

రహదారుల అభివృద్ధితో గ్రామ ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు తగ్గనున్నాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**సమస్య ఏదైనా.. పరిష్కారమే లక్ష్యం**

గ్రామ ప్రజల అవసరాలను తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ సర్పంచ్ వరలక్ష్మి రాజు పనిచేస్తున్నారని గ్రామస్తులు అన్నారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలపై కూడా ఇదే విధంగా ప్రత్యేక దృష్టి సారించి, మౌలిక వసతులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్పంచ్ చొరవతో సమస్యలు పరిష్కార దిశగా సాగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**అధికారుల సహకారంతో అభివృద్ధి పనులు**

గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రవీంద్ర, పంచాయతీ కార్యదర్శి నిరంజన్, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు, వార్డు సభ్యురాలు ప్రమీల, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# పేదల పాలిట ఆపన్నహస్తం.. తిరుమల రావు

## - సేవే సంకల్పంగా ముందుకు.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండ
## -మహిళలు, విద్యార్థులు, యువతకు సహకారం.. సేవా కార్యక్రమాలకు ప్రజల అభినందనలు

**కారేపల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ.. పేద కుటుంబాలకు తనవంతు చేయూతనందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న గుడిపూడి తిరుమల రావు స్థానికంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ అవసరంలో ఉన్న వారికి సాధ్యమైనంత సహాయం అందిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సింగరేణి మండల పరిధిలో ఇప్పటికే వందకు పైగా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, వెయ్యి మందికి పైగా పేద మహిళలకు చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రెండు మండలాల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించి క్రీడాకారులకు ప్రోత్సాహం అందించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, మౌలిక వసతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారని స్థానికులు తెలిపారు.

అవసరమైన సమయంలో స్పందించి ప్రజలకు అండగా నిలవడం ఆయన సేవా కార్యక్రమాల్లో ప్రత్యేకతగా పేర్కొంటున్నారు. తన సంపాదనలో కొంత భాగాన్ని పేద ప్రజల సంక్షేమానికి వినియోగించాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని గుడిపూడి తిరుమల రావు తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ తనపై మరింత బాధ్యతను పెంచుతోందని, భవిష్యత్‌లో మరిన్ని గ్రామాలకు సేవా కార్యక్రమాలను విస్తరిస్తానని పేర్కొన్నారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తూ కొనసాగిస్తున్న తిరుమల రావు సేవా కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు.



# వైరాలో ఘనంగా వనమా విశ్వేశ్వరరావు జన్మదిన వేడుకలు

**వైరా, సెప్టెంబర్ 9, (భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఆర్యవైశ్య మహాసభ లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో బుధవారం వనమా విశ్వేశ్వర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు,మని కుమారి దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన వస్త్రాలను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వాసవి ఉత్ సభ్యులు, నాయకులు, మండల పట్టణ ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు, లైన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# జిల్లాలో పోషణ్ మాసం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి :** : మహిళలు, చిన్నారులలో పోషకాహార స్థాయిని మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ్ మాసం కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించే పోషణ్ మాసం వాల్ పోస్టర్ ను కలెక్టర్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ ఏడాది “మన అంగన్ వాడీ – మన బాధ్యత” అంశంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మల్లేశ్వరి, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో విద్యుత్ భద్రతే ముఖ్యం!

**- నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

**- సింగరేణి మండల ప్రజలకు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన గుడిపూడి తిరుమలరావు**

**కారేపల్లి, సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్ రాములు ):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి మండల ప్రజలకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమలరావు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

**విద్యుత్ తీగల విషయంలో జాగ్రత్త**

వినాయక మండపాల ఏర్పాటులో విద్యుత్ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని తిరుమలరావు సూచించారు. మండపాలు, అలంకరణలు, ప్రచార బోర్డులు, తాత్కాలిక నిర్మాణాలు విద్యుత్ తీగలు, అధిక విద్యుత్ ఒత్తిడి తీగలు, విద్యుత్ స్తంభాలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపాలకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేటప్పుడు నిపుణులైన విద్యుత్ సిబ్బంది సూచనలు తీసుకోవాలని, నాణ్యమైన తీగలు, పరికరాలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. విద్యుత్ లోపాలు, షార్ట్‌సర్క్యూట్‌లు, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

**భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి**

ఉత్సవాల సందర్భంగా మండపాల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఉత్సవ కమిటీ సభ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. “వినాయక చవితి భక్తి, ఆనందం, ఐక్యతకు ప్రతీక. ప్రతి కుటుంబం ఎలాంటి విషాద ఘటనలకు గురికాకుండా సంతోషంగా పండుగ జరుపుకోవాలి. పండుగ సమయంలో అప్రమత్తత, భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి” అని గుడిపూడి తిరుమలరావు పేర్కొన్నారు. ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీలు సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటించాలని, తొమ్మిది రోజుల వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.



# ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీహెచ్ మహేందర్.జి



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 09 :** సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాస్టింగ్ దెబ్బకు ఇళ్లకు బీటలు..

- వానకు కూలిన ఇల్లు సగ భాగం...
- కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రభావిత గ్రామంలో ఘటన
- కూలే సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



**కాసిపేట, సెప్టెంబర్ 9 :** ఓపెన్‌కాస్ట్ గని బ్లాస్టింగ్ శబ్దాలకు ఇళ్లు దద్దరిల్లుతున్నాయి.. గోడలకు పగుళ్లు వస్తున్నాయి.. చివరకు ఆ పగుళ్లే ఓసీ ప్రభావిత గ్రామాల కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. బెల్లంపల్లి మండలం సోమగూడెం(బీ) గ్రామపంచాయతీ పరిధిలోని కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రభావిత ప్రాంతంలో చెట్టి శాంతకు చెందిన ఇల్లు బుధవారం కురిసిన వర్షానికి సగభాగం కూలిపోయింది.

**బ్లాస్టింగ్‌తో పగుళ్లు.. వర్షంతో కుప్పకూలింది**

కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ గనిలో జరుగుతున్న బ్లాస్టింగ్ ప్రభావంతో ఇంటి గోడలకు కొంతకాలంగా పగుళ్లు ఏర్పడినట్లు బాధిత కుటుంబం చెబుతోంది. ఇప్పటికే బలహీనంగా మారిన ఇంటిపై బుధవారం కురిసిన వర్షం ప్రభావం పడటంతో ఒక్కసారిగా సగభాగం కూలిపోయింది. ఇంటి పైకప్పు, గోడలు ధ్వంసమై తీవ్ర నష్టం వాటిల్లింది. ఇల్లు ముందు సగ భాగం కూలిపోయే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అదే సమయంలో అక్కడ ఎవరైనా ఉండి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలిన ఇంటిని స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. నాయకులు ముత్తే భూమయ్య, పొన్నాల కనకరాజు, వార్డు సభ్యులు బాదె ఉమ, జాడి ప్రమీల, మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కుక్క రాంచందర్ తదితరులు పరిశీలించారు.

**పరిహారం అందించాలని డిమాండ్**

ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్ కారణంగా తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని ప్రభావిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఘటనాస్థలిని పరిశీలించి ఇంటి నష్టాన్ని అంచనా వేయాలని, బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



## వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం

- నిందితుడి అరెస్ట్
- లక్షెట్టిపేట జైలుకు తరలింపు

**తాండూర్, సెప్టెంబర్ 09:** వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక మహిళను మోసం చేసిన నిందితుడిని తాండూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాండూరు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు మండలం, అచలాపూర్ గ్రామానికి చెందిన కొట్టే రవి అనే వ్యక్తి, ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. ఆ తర్వాత వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాండూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 108/2026, యూ/ఎస్ 69 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం, పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి బెల్లంపల్లి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. గౌరవ న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో, అతనిని లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# నిర్ణీత సమయంలోగా భూ సర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**బయ్యారం, సెప్టెంబర్ 9 :** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేను అధికారులునిర్ణీత సమయం లోగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామ పరిధిలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను, ఫీల్డ్ రిజిస్టర్ లను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, గంధపల్లి సర్పంచ్ ప్రవీణ్, సర్వేయర్లు, ఇరిగేష్ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం!

- గురుకుల పాఠశాల విద్యార్థికి గుండెపోటు..
- అధికారుల అలసత్వమేనని విద్యార్థి సంఘాల ఆందోళన..
- ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకొని
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం..!





**ఉమ్మడి ఖమ్మం జిల్లా :** : ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు సంఘటనలు తీవ్ర కలకలం రేపాయి.. అభం శుభం తెలియని ఓ బాలుడు గుండె పోటుతో దుర్మరణం పాలవగా.. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.. బాధిత కుటుంబాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం రఘునాధపాలెం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సాత్విక్(13) బుధవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి విద్యార్థులతో ఆడుకుం టుండగా కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అతడిని స్థానిక ఉపాధ్యాయులు హుటాహుటిన ఖమ్మంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు, అప్పటికే మరణించినట్లు నిర్ధారించి భౌతిక కాయాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి స్వస్థలం తిరుమలా యపాలెం మండలం కాకరవాయి. సమాచారం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు హరీష్, ప్రియాంక ఇద్దరూ, వారి బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కి చేరుకొని విగత జీవిగా మారిన తమ ముద్దుల బిడ్డను చూసి హతాశులయ్యారు. తమ ఆశల సౌధం కుప్ప కూలిందని గుండెలవిసేలా రోదిస్తుంటే అక్కడి వాతావరణం ఉద్వేగ భరితంగా మారింది. బాలుడు మరణ వార్త వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ఖమ్మం వ్యాప్తంగా వ్యాపించడంతో పలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకున్నాయి. గురుకుల పాఠశాలల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని, కనీస మౌలిక వసతులు కూడా కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యాయని ఆరోపిస్తూ ఆందోళనకు దిగాయి. ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్య ఫలితమేనని, బాధితుడు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. పరిస్థితి అదుపు తప్పకుండా ఖమ్మం టూ టౌన్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలుడు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ బాలకృష్ణ దర్యాప్తు చేపట్టారు.

**ఉరి వేసుకుని ఇంటర్ మృతి..!**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తుమ్మ రెడ్డి శ్రీ చరణ్ రెడ్డి (19) ఉరి వే బలవన్మరణానికి పాల్పడ్డాడు. కళాశాల నుంచి మూడు రోజుల క్రితం విద్యార్థి గంగారం వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో తన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థి మరణానికి గల కారణాలను అతని తల్లిదండ్రులను అడిగారు. ఎవరికి ఏమి చెప్పలేదని రోదిస్తూ జవాబు ఇవ్వడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 09:** : పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాద్యతాయుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిరక్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత గణపతి ప్రతిమల కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్ జగన్ తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమ నాయకుడు జే.రవీందర్ మృతి



**రామకృష్ణా పూర్, సెప్టెంబర్ 09(** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నాయకుడు, మందమర్రి బీఆరెస్ పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని రెనో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో రవీందర్ కీలకంగా పనిచేశారు. అనంతరం రాజకీయాల్లో కొనసాగుతూ బీఆరెస్ లో క్రియాశీలకంగా వ్యవహరించారు. మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహించారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యలపై తనదైన శైలిలో స్పందించేవారు. రవీందర్ మృతి విషయం తెలియడంతో నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి, మందమర్రి పట్టణానికి తీరని లోటని పేర్కొన్నారు. రవీందర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలకు బీఆరెస్నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ సహచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.

# సరస్వతి కాలువ నీరు విడుదల చేయండి

- పీసీసీ అధ్యక్షునికి కూచాడి శ్రీహరి రావు విజ్ఞప్తి



**లక్ష్మణచందా, సెప్టెంబర్ 9 ::** నిర్మల్ నియోజకవర్గ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు కోరారు. ఈ విషయాన్ని పిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల నీటి విడుదలకు చర్యలు చేపట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కూచాడి శ్రీహరి రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచాడి శ్రీహరి రావు తో పాటు లక్ష్మణ చందా

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046